

రోబోటిక్స్ శిక్షణతో సాంకేతిక స్ఫూర్తి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యార్థుల్లో సాంకేతికలో స్ఫూర్తిని నింపడంలో రోబోటిక్స్ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సంగం లక్ష్మీబాయి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల రోబోటిక్స్ ప్రదర్శనలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను ప్రశంసించారు. పలు ప్రశ్నలు అడిగి వారిలో సాంకేతిక పట్ల ఆసక్తి పెంచారు. శిక్షణ ప్రగతిని సమీక్షించి, విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ కార్యక్రమం విజయవంతంగా అమలవుతుందన్నారు. జిల్లాలో మొత్తం ఐదు పాఠశాలల్లో రోబోటిక్స్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుండగా అందులో మొత్తం 568 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి, ప్రతి పాఠశాలకు రోబోటిక్స్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ జెడ్పీహెచ్ఎస్(బాయ్స్) 98 మంది, జెడ్పీహెచ్ఎస్(గర్ల్స్) 122 మంది, జెడ్పీహెచ్ఎస్ కొత్తగడి 97 మంది, కేజీబీవీ వికారాబాద్ 121 మంది, సంగం లక్ష్మీబాయి ఎన్నెపల్లి 130 మంది విద్యార్థులు శిక్షణ పొందరన్నారు. కార్యక్రమంలో సోహం అకాడమీ వ్యవస్థాపకులు కొమరగిరి సహదేవ్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జశ్వంత్, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష పత్రాల వేలం

మేడ్చల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిలాలో 10వ తరగతి మార్చి/ జూన్ 2023-24 కు సంబంధించిన ఫస్ట్ సెట్, సెకండ్ సెట్ ప్రశ్నా పత్రాలను వేలం వేయనున్నట్లు జిల్లా విద్యాధికారి విజయ కుమారి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలంలో పాల్గొనాలనుకునేవారు రూ. 10వేలు జిల్లా విద్యాధికారి, మేడ్చల్-మల్కాజ్‌గిరి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీసి వారి రేట్ల వివరాలతో సీల్డ్ కవర్ కొటేషన్‌ను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో 13న మధ్యాహ్నం 2 నుంచి 3 గంటలలోపు సమర్పించాలని కోరారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్స్ ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు.

పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. నిత్యం పాఠశాల సమయం పూర్తయిన తర్వాత 4.15 నుంచి 5.15 గంటల వరకు గంట పాటు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. గత మూడేళ్లుగా పది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలోనే కొనసాగుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా విద్యాశాఖ ఈసారి ఉత్తీర్ణతా శాతం పెరగడంతో పాటు రాష్ట్ర స్థాయిలో మెరుగైన స్థానంలో నిలవాలన్న లక్ష్యంతో ప్రత్యేక దృష్టి సారించింది.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

జిల్లా వివరాలు	పాఠశాలలు 176
బాలురు 3,861	బాలికలు 3,217
మొత్తం విద్యార్థులు 7,078	

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

» గత అనుభవాల నేపథ్యంలో పకడ్బందీ కార్యాచరణ
» త్వరలో విద్యార్థులకు అభ్యసన దీపికలు పంపిణీ
» దృష్టి సారించిన విద్యాశాఖ అధికారులు



వికారాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదో తరగతి చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఏ విధంగా సన్నద్ధం కావాలనేది టీజీఎస్‌ఈఆర్టీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాల గురించి వివరించడంతో పాటు అంత వరకు బోధించిన పాఠ్యాంశాల్లో విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించిన అభ్యసన దీపికలను పార్ట్-2 పాఠ్య పుస్తకాలతో పాటు విద్యార్థులకు అందించేలా విద్యా శాఖ చర్యలు చేపట్టింది.

వెనుకబడిన అంశాల్లో ప్రత్యేకంగా..

జిల్లాలో 176 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో

మిగతా 8వ పేజీలో...

సందేహాలను నివృత్తి చేస్తూ

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నాం. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. పాఠ్యాంశాల్లో విద్యార్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా ఉపాధ్యాయులు వ్యవహరించనున్నారు. త్వరలో పదో తరగతి విద్యార్థులకు అభ్యసన దీపికలు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం.



-రేణుకాదేవి, జిల్లా విద్యా శాఖ అధికారి, వికారాబాద్



రేపు పోలియో చుక్కల పంపిణీ

» డీఎంహెచ్‌వో ఉమాగౌరి

మేడ్చల్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరూ పోలియో చుక్కలు తీసుకునేలా తల్లి దండ్రులు, అధికారులు కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఉమాగౌరి సూచించారు. రేపు (12వ తేదీ)న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమ వివరాలను డీఎంహెచ్ఓ వివరించారు. జిల్లా వ్యాప్తంగా 5,24,973 మంచి చిన్నారులున్నారని, వీరందరికి పోలియో చుక్కలను మోతాదు ప్రకారం ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకుగాను జిల్లాలో మొత్తం 1,125 పోలియో బూత్‌లు, 31 మొబైల్ టీంలు, 31 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. జిల్లాలోని 1,125 బూత్‌లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.



విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కీసరగుట్టలోని విఘ్నేశ్వరుడికి ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకాలు, నిర్వహించి పూజలు నిర్వహించారు.

-కీసర, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి)

సబ్‌కోర్టు కలేనా?

వికారాబాద్ కోర్టుకు వెళ్లేందుకు ప్రజల ఇబ్బందులు
అర్హతలున్నా మంజూరుకాని సబ్ కోర్టు
తాండూరులో లేబర్ కోర్టుకు సైత డిమాండ్లు

తాండూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తాండూరులో మున్సిఫ్ కోర్టును నిజాం కాలంలో ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల ప్రభుత్వం ఈ కోర్టు స్థాయి పెంచి అదనపు కోర్టుగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే సబ్‌కోర్టు మాత్రం ఏర్పాటు కాలేదు. ఇక్కడ సబ్‌కోర్టు కోసం 20ఏళ్లుగా ప్రజలు నిరీక్షిస్తున్నారు. ప్రతీ కేసు విషయంలో వికారాబాద్ కోర్టుకు వెళ్తున్నారు. కక్షిదారులు, న్యాయవాదులు వికారాబాద్ కోర్టుకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక వివాదాల్లో 2020సంవత్సరం దాకా రూ.3లక్షల వరకు లావాదేవీల కేసులు తాండూరు కోర్టులో పరిష్కారమయ్యేవి. తదనంతరం ఈ స్థాయిని రూ.20 లక్షలకు పెంచారు. తర్వాత రూ.10లక్షలలో లోపునకు కుదించారు. తాండూరు, కొడంగల్, కర్ణాటకలోని సేడం, చించోళిల్లో నిజాం కాలంలోనే కోర్టులు ఏర్పడ్డాయి. తాండూరులో 1980లో మున్సిఫ్ కోర్టును ప్రారంభించారు. కొడంగల్, సేడం, చించోళిల్లో ఇప్పటికే అదనపు కోర్టులను ఏర్పాటు చేయగా 2024లో తాండూరులో అడిషనల్ కోర్టును ఏర్పాటు చేశారు. హత్యాయత్నం, ఆత్మహత్య, విడాకుల కేసులు, మూడేళ్ల నుంచి ఏడేళ్లలోపు శిక్షపడే కేసులకు వికారాబాద్ కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. తాండూరులో సబ్ కోర్టు ఏర్పాటైతే ఇలాంటి కేసులన్నీ తాండూరులోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. ప్రతి సబ్ డివిజన్‌లో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని నిబంధనలున్నాయి. ఏ రకంగా చూసినా తాండూరు రెవెన్యూ డివిజన్‌లో

మిగతా 8వ పేజీలో...

20ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు



తాండూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

ప్రజాప్రతినిధులు స్పందించాలి



తాండూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు గతంలో ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మంత్రులను సైతం కలిశాం. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోనే సబ్‌కోర్టు భవనాన్ని నిర్మించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. భవనం అందుబాటులో ఉంటే సబ్‌కోర్టు త్వరగా మంజూరవుతుంది. సబ్ కోర్టుకు కోసం 20 ఏళ్లుగా న్యాయవాదులంతా ప్రయత్నాలు చేస్తున్నాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, తాండూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

తాండూరు మాతాశిశు ఆస్పత్రి పరిశీలన

తాండూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ) బృందం తాండూరు జిల్లా ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలో ఎం సదుపాయలు కల్పిస్తున్నారు? ఇంకా ఎలాంటి సదుపాయలు అవసరం అన్న విషయాలను పరిశీలించారు. అలాగే స్టాఫ్, ఎక్విప్మెంట్ ఎంత అవసరం, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీఐ బృందానికి చెందిన డాక్టర్ శ్రీదేవి, ఇతర సభ్యులు ఉన్నారు. వారితో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ ఆనంద్ గోపాల్‌రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ శరత్ చంద్రా, సిబ్బంది ఉన్నారు.



తాండూరు ఆస్పత్రిలో కేంద్ర వైద్య బృందం



రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలి
జిల్లా వ్యాప్తంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు 7

32 రైళ్లు రద్దు
వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్ 7

బడీడు పిల్లలను బడికి పంపాలి

» మేడ్చల్ డీఈవో విజయకుమారి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను తల్లిదండ్రులు ఇళ్ల వద్ద వదలకుండా చదువుకోవడానికి స్కూళ్లకు పంపాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి సూచించారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ చెక్‌పోస్టు వద్ద ఎంపీపీఎస్ పాఠశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్టు ప్రాంతంలో చాలావరకు నిరుపేద కుటుంబాలు నివశిస్తున్నాయని తెలిపారు. వారంతా విధిగా తమ పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. నిరుపేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పాఠశాలను ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో విజయకుమారి

అనుమతుల్లేని క్లినిక్‌ల సీజ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) /కందుకూరు, అక్టోబరు 10 : ఉమ్మడి జిల్లాలో అనుమతుల్లేని క్లినిక్‌లపై ఉక్కుపాదం మోపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనుమతుల్లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అందులో కిస్మత్‌పురలోని భవానీ క్లినిక్ నిర్వాహకుడు రమేశ్, సరిత ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌కు చెందిన సరితగౌడ్, హోప్ పాలీ క్లినిక్‌కు చెందిన జ్యోతి, కందుకూరులోని లలిత క్లినిక్‌కు చెందిన వెంకటయ్యపై కేసు నమోదు చేశారు. అలాగే మేడ్చల్ జిల్లా కీసరలో సుజాత మెడికల్ స్టోర్ నిర్వాహకుడు రాంబాబు, భాస్కర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ భాస్కర్, మణికంఠ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ కృష్ణ, లైఫ్ సేవ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బండ్లగూడకు చెందిన వారిపై కేసు నమోదు చేశారు. ఆయన వెంట మెడికల్ కౌన్సిల్ మెంబరు డాక్టర్ ఇమ్రాన్‌అలీ పాల్గొన్నారు.

ఆర్టీఐని సద్వినియోగం చేసుకోవాలి

కీసర, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)ను ప్రతీ పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి సూచించారు. ఆర్టీఐ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కీసర తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. చట్టంలోని సెక్షన్ల ప్రకారం నిర్ణీత సమయంలో సంబంధిత అధికారులు దరఖాస్తుదారుడికి సమాచారం అందజేయాల్సి ఉంటుందన్నారు. అనేక ఉద్యమాల ద్వారా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్లు భాస్కర్‌రెడ్డి, అశ్విన్ లతో పాటు అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

హాస్టల్లో ఉండడం ఇష్టం లేదని

భవనం పైనుంచి దూకిన విద్యార్థి

పెద్దేముల్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం ఇష్టం లేదని ఒక విద్యార్థి గురుకుల పాఠశాల భవనం పైనుంచి దూకేశాడు. అదృష్టవశాత్తు ఆ విద్యార్థి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ధారూర్ మండలానికి చెందిన విద్యార్థి మంబాపూర్ మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఇక్కడే గతేడాది 5వ తరగతి పూర్తి చేశాడు. ఇటీవల దసరా పండగకు ఇంటికి వెళ్లిన విద్యార్థి తనకు హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేదని తల్లిదండ్రులతో మారాం చేశాడు. వచ్చే ఏడాది నుంచి నీకు ఇష్టం వచ్చిన చోట చదువుకుందువని తల్లిదండ్రులు నచ్చచెప్పి మంగళవారం పాఠశాలకు పంపించారు. మూడు రోజులపాటు బాగానే ఉన్నాడు. శుక్రవారం ఏం ఆలోచించుకున్నాడో కాని భవనం మొదటి అంతస్తు పైనుంచి దూకేశాడు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురై వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం) ఆధ్వర్యంలో విదేశీ నియామక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీఓఎంసీఓఎం గ్రీస్‌లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవారంగాల్లో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, డిగ్రీ కలిగి ఉన్నవారు అర్హులన్నారు. వీరికి జీతం రూ.92వేల నుంచి రూ.1,22,000 వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 94400052081, 9440051452 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ మెటీరియల్‌ను అందిస్తున్న డీఈవో

చదువుతోపాటు స్పోర్ట్స్‌లో రాణించాలి

» జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి

కొడంగల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ఇందుకు స్పోర్ట్స్ మెటీరియల్ దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి అన్నారు. కొడంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శుక్రవారం ఎంఈవో రామ్‌రెడ్డికి అందించిన మెటీరియల్‌ను డీఈవో చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ రవీందర్‌గౌడ్, అనిల్‌కుమార్, వేణుగోపాల్, రవి, నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదలో ఇరుక్కుపోయిన అంబులెన్స్


కోకట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటిలో అంబులెన్స్

యాలాల, అక్టోబర్ 10, (ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో అంబులెన్స్ ఇరుక్కుపోయింది. శుక్రవారం కోకట్ నుంచి రాజీవ్ కాలనీ వైపు వెళ్తున్న అంబులెన్స్ మార్గమధ్యలోని రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో ఆగిపోయింది. అంబులెన్స్‌లో ఎవరూ అంబులెన్స్‌లో ఉన్న సిస్టర్స్, డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్‌కు ఈ రోడ్డు మార్గంలో అంతగా అవగాహన లేకపోవడంతో నీటి శాతం కొద్దిగా ఉందని భావించి అందులో నుంచి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు పలువురు చెప్పారు.


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధితులకు రూ.25 కోట్లు ఇవ్వాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాండూరు శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.25 కోట్లతో జీవో మంజూరు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ముఖ్య కార్యదర్శి త్వరలో జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చామల రఘుపతిరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు కీలక పాత్ర వహించాలని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సైతం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, త్వరలో స్పీకర్‌తో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్ ముదిరాజ్, సిద్దులూరు యాదగిరి, విజయ్‌కుమార్, నరేందర్, రోహిత్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఓపీ డ్యూటీలు రద్దు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

ధారూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఓపీ డ్యూటీలు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని ఆశా వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జీపీఎస్ ఆఫ్ విధానం రద్దు చేయాలని, అదనపు పని విధానం తొలగించాలని, ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలాగే స్వీపర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని, ధారూరు సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, 24 గంటలపాటు డాక్టర్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సంవత్సరానికి మూడు జతల నాణ్యమైన యూనిఫారమ్స్ ఇవ్వాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు సుదర్శన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న పార్థసారథి

సెర్చ్ స్వచ్ఛంద సంస్థకు అవార్డు

కందుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో అమెజాన్ కంపెనీ సౌజన్యంతో పలు కార్యక్రమాలను చేపట్టిన సెర్చ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సీఆర్ఎస్ బాక్స్(డూయింగ్ గుడ్ భారత్) అవార్డు అందుకున్నారు. గురువారం రాత్రి ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల రాష్ట్ర మంత్రి(భారత ప్రభుత్వం) మురుగన్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధి పార్థసారధి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో కందుకూరు, షాబాద్ మండలాల్లో జల వనరులను పునరుద్ధరించడంలో విశేష కృషి చేసినట్లు తెలిపారు. పర్యావరణ సంరక్షణకు తమ సంస్థకు మద్దతునిచ్చిన అమెజాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ సుస్థిర జల నిర్వాహణ, వాతావరణం, సమాజాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. అమెజాన్ సంస్థ సౌజన్యంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను గుర్తించి సీఆర్ఎస్ బాక్స్(డూయింగ్ గుడ్ ఫర్ భారత్) 2025 అవార్డుకు ఎంపిక చేయడంపై వ్యక్తం చేశారు.

ఘనంగా కలెక్టర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ జన్మదిన వేడుకలను కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ జిల్లా అధికారుల సమక్షంలో కలెక్టర్‌తో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మంగిలాల్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్డీవో వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


పూజల్లో భట్టు కిషన్‌రెడ్డిఅనురాధ దంపతులు

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలం రాజీవ్‌నగర్ తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జాభవాని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, కొల్కులపల్లి మాజీ సర్పంచ్ భట్టు అనురాధ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా తొలి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాదన, అగ్నిప్రతిష్ట, వాస్తు హోమం, జలాది వాసం, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు, తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.


పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఉద్యాన సాగుపై ఆసక్తి పెంచుకోవాలి

చేవెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి పెంచుకోవాలని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని పలుగుట్ట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలతోపాటు పూల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు హార్టికల్చర్ సమగ్రాభివృద్ధి మిషన్‌తో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాలు, తోట వృక్షాలు మొదలైన వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అభివృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు వినూత్న, హర్షిత, ప్రేసి, కీర్తన, శివాణి, మేఘన, మానస, భావన, తదితరులు ఉన్నారు.

ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


అంతారం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన తీసిన గుంత

చేవెళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ విల్లాస్ ప్రాజెక్టు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రోడ్లను ధ్వంసం చేస్తూ తరుచు ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చేవెళ్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, అంతారం సీనియర్ నాయకుడు సుధాకర్, పలువురు గ్రామస్తులు ఆరోపించారు. శుక్రవారం వారు స్థానికంగా మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న అర్గానిక్ విల్లాస్ ప్రాజెక్టు నిర్వాహకులు గ్రామానికి వెళ్లే రోడ్డు వెంబడి రాత్రి సమయంలో ప్రత్యేకంగా అండర్ కేబుల్ లైన్ కోసం జేసీబీ సహాయంతో గుంతలు తీసే పనులు చేస్తున్నారన్నారు. ఇది గమనించకుండా అంతారం గ్రామానికి బైక్‌పై వస్తున్న ప్రభాకర్ గురువారం రాత్రి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి గుంతలో పడడంతో కాళ్లు విరిగి నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే కొద్ది రోజులుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. గురువారం రాత్రి సమయంలో తీసిన గుంతల పనులను గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నట్లు చెప్పారు. గుంతలు ఎందుకు తీస్తున్నారని ప్రశ్నిస్తే హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నామని విల్లాస్ నిర్వాహకులు బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్గానిక్ విల్లాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి

కొడంగల్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో విధిగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ అధికారి తులసి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిమేశ్వరంలో పత్తి, కంది, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి ఐసాక్ హెరాల్డ్ రైతులు కె.శ్రీనివాస్, మోహన్, మోహన్ రెడ్డి, రాములు, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రగతి నిరోధకంగా విపక్షాలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తూ రాష్ట్రంలో ప్రగతి నిరోధకంగా మారారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆరోపించారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్‌కు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్య నాయక్, ముద్విన్ మాజీ సర్పంచ్ రామచందరయ్య, నాయకులు నక్కపోతు నర్సింహ, సురేందర్‌రెడ్డి, రమేశ్, నర్సింహ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం నాయకులు

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు

ధారూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మహ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు ముస్లింలను అవమానించేలా ఉన్నాయని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎస్ఐ రాఘవేందర్‌కు ధారూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బహిరంగ సభలో మహ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు మత పరమైన విద్వేశాలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జామా మసీదు కమిటీ అధ్యక్షుడు ఉమ్మర్, ఎంఐఎం నాయకుడు మోహిజ్ ఖురేషి ఉన్నారు.

తపాలా ఉద్యోగులకు సన్మానం



పోస్టల్ ఉద్యోగులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల సుప్రభాత్‌టౌన్‌షిప్‌లో పోస్టల్ ఉద్యోగులను సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాదవ్ మాట్లాడుతూ.. 150 సంవత్సరాల నుంచి పోస్టల్‌శాఖ ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని ముందుకు సాగుతుందన్నారు. లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తూ ప్రజలకు ఉత్తరాలు చేరవేయడమే కాకుండా పొదుపు, బీమా సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. కొర్రెములలో పోస్టాఫీసులో పనిచేస్తున్న నందకిషోర్, జితేందర్, సౌజన్యను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి రూ.కోటి మంజూరు



పార్కును పరిశీలిస్తున్న కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌జేఆర్, కేఎల్ఆర్ ఫేస్ టూలోని ఎకరం స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయడానికి రూ. కోటి మంజూరు చేయటం అభినందనీయమని కాంగ్రెస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఎన్‌జేఆర్‌కేఎల్ఆర్ ఫేస్ టూలోని ఎకరం పార్కు స్థలంలో వాకింగ్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేయటానికి హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులకు చేసిన ఫిర్యాదుపై స్పందించి రూ.కోటి మంజూరు చేశారన్నారు. పార్కును త్వరగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.


పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

బషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఔట్ సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మోడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ కింద 39 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లు పని చేస్తున్నారని తెలిపారు. ఎనిమిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయమై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

శామీర్‌పేట పెద్ద చెరువు పరిశీలన



శామీర్‌పేట పెద్ద చెరువును పరిశీలిస్తున్న సభ్యులు

శామీర్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ రోయింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు శామీర్‌పేట పెద్ద చెరువులో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో రోయింగ్ ఫెడరేషన్ టెక్నికల్ బృందం, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు శామిర్‌పేట పెద్దచెరువును సందర్శించారు. క్రీడల నిర్వహణకు సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. విస్తీర్ణం, లోతు తదితర అంశాల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వీసీ అండ్ ఎండ స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ, శామిర్‌పేట తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కీసర ఆర్ఐ రమేశ్ బదిలీ

కీసర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కీసర తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఆర్ఐ రమేశ్ బదిలీ అయ్యారు. అతని స్థానంలో బాచుపల్లిలో విధులు నిర్వహించిన మహేందర్ కీసరకు వచ్చారు. గత కొంత కాలంగా కీసరలో ఆర్ఐగా విధులు నిర్వహించిన రమేష్ హఠాత్తుగా గురువారం రాత్రి ఉత్తర్వులు రావడం, శుక్రవారం మాల్కాజ్‌గిరి ఆర్డీవో కార్యాలయంలో రిపోర్ట్ చేయడం, మహేందర్ కీసరలో చార్జ్ తీసుకోవడం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలి



కడ్తాలలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

» బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

కడ్తాల్/చౌదరిగూడ/మంచాల/తాండూరు/పరిగి/మేడ్చల్ టౌన్/షాబాద్: అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసనాలు తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిబా పూలే విగ్రహం వద్ద వివిధ పార్టీల నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, సత్యం యాదవ్, రవి, మంగళపల్లి నర్సింహ, రాజేశ్, రాంచందర్ నాయక్, శేఖర్, లాయక్‌అలీ, తదితరులున్నారు.

42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదాం

బీసీలు హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని బీసీ సేన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి విభాగం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్, బీసీ సేన మండలాధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, దామోదర్, అనిత, సాగర్, మల్లేష్, లావణ్య, జంగయ్య, లక్ష్మి, బాలమణి, శ్రీను పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకూ పోరాడుతామని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. షాబాద్‌లో కంది - షాద్‌నగర్ జాతీయ రహదారిపై ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సేన మండలాధ్యక్షుడు దయాకర్ చారి, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, యూత్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ వెంకట్ యాదవ్, మాజీ ఎంపీటీసీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ మంచాల మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు ప్లకార్డులు పట్టుకుని రాస్తారోకో చేశారు. ఆందోళనలో కంభాలపల్లి భాస్కర్, అశ్వాల బాల్‌రాజ్, చిందం శ్రీశైలం, వంగాల కృష్ణ, మొగిలి మహేష్, పసుల కృష్ణ, గజ్జి అయలయ్య, శివరాల పాండు, సత్తయ్య, మంకు వినోద్, గడ్డం రాజేష్, చంద్రయ్య, కుర్రరాజు, గ్యార పాండు, మల్ల లింగం, మొగిలి శ్రీశైలం పాల్గొన్నారు.

ఇది అగ్రవర్ణాల కుట్ర

బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం హైకోర్టులో స్టే ఇవ్వడం వెనుక అగ్రవర్ణాల కుట్ర దాగి ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. హైకోర్టు స్టేకు నిరసనగా తాండూరు అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన బీసీల ధర్నాలో పాల్గొన్నారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్‌సుకూర్, గడ్డం వెంకటేష్, అనిత, మంజుల, విజయలక్ష్మి, శివలీలా ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రతోనే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషనల్ల ఆంశం బీజేపీ, బీఆర్ఎస్ కుట్రతోనే నిలిచిపోయాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్ ఆరోపించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పరిగిలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, గోపాల్ పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో...

టీ-జేఏసీ జిల్లా కన్వీనర్ ఎం.నాగేశ్వర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు బీసీల హక్కు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, గోవింద్ నాయక్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, దోమ శ్రీశైలం, పి.బాబయ్య పాల్గొన్నారు.

స్టే దురదుష్టకరం

బహుజన సమాజాన్ని అణిచివేసే కుట్రలో భాగంగా బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్నారని బీసీ సేవ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు అరుణ్‌యాదవ్ ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై స్టే రావటాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థులతో కలిసి మేడ్చల్‌లో రాస్తారోకో చేశారు. హైకోర్టు రిజర్వేషన్ల పట్ల స్టే ఇవ్వటం దురదృష్ట కరమన్నారు.



చౌదరిగూడలో బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేపట్టిన బీసీ సేన నాయకులు



తాండూరు: అంబేడ్కర్ చౌక్‌లో ధర్నా చేస్తున్న బీసీ సంఘం నాయకులు



మేడ్చల్ టౌన్: రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నాయకులు

ఇది ప్రభుత్వ వైఫల్యమే..

బీసీ నేత బీఆర్ఎస్ కృష్ణ ముదిరాజ్



వికారాబాద్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నా జీవో నంబర్ 9పై హై కోర్టులో స్టే ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఆర్.కృష్ణ ముదిరాజ్ అన్నారు. రెండేళ్లుగా కొలిక్కిరాక బీసీల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక అభివృద్ధి కుంటుపడిపోతోందన్నారు. ఈ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చినప్పుడే రాజ్యాంగ భద్రత వస్తుందన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

» బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి

వికారాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి తెలిపారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీజేపీ గతంలో కంటే ఇప్పుడు చాలా బపడిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం గెలిచినట్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సామాన్యులకు అందుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కోకన్వీనర్ అమరేందర్ రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షులు సురేందర్, సూర్యప్రకాశ్, రఘు, మోహన్ రెడ్డి, గొడుగు సుధాకర్, శ్రీకాంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో మెలగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కృష్ణయ్య

మేడ్చల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగాన్ని చేపట్టే ప్రతిఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సీఈఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఘనాపూర్ మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ 2 కె 19 గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. వైద్య రంగాన్ని ఎంచుకున్న వారు వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. పరిశోధనలు, ఇతర సాంకేతిక వైద్య విధానం గురించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామ కృష్ణ మాట్లాడుతూ.. తమ కళాశాలలో 2019 బ్యాచ్ విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని వైద్య రంగంలో ప్రవేశించడం ఆనందంగా ఉందన్నారు. వైద్యులు మనస్ఫూర్తిగా వృత్తికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర సింగ్, కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



కులకచర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ మనోహర చక్రవర్తి

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

కులకచర్ల/మర్పల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన కల్పించారు. ప్రతీ సంవత్సరం అక్టోబరు 5 నుంచి 12 వరకు ఆర్టీఐ చట్టం దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐలు ఖాజా, రాఘవేందర్‌చారి, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పర్శురాం, ఆర్ఐ మాధవరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

» ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు

పరిగి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం పరిగి మండలం ఖుదాంద్‌పూర్ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. పరిగి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(35), అదే గ్రామానికి చెందిన కె.నరేష్, పాశం శ్రీశైలం, నల్లోల నర్సింహులు కలిసి చిట్యాల్‌లోని కార్పెంటర్ దగ్గర నుంచి ఇంటికి సంబంధించిన సామగ్రిని తీసుకుని రావులపల్లికి వస్తుండగా, ఖుదాంద్‌పూర్ శివారులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. కారులో ఉన్న రాజు మృతి చెందగా, నరేష్, శ్రీశైలం, నర్సింహులుకు గాయాలయ్యాయి. పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వారంపాటు 32 రైళ్లు రద్దు

» వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

» గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..

» డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేంద్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యం

కొడంగల్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సం సందర్భంగా విద్యార్థులకు కళాశాల వృక్షశాస్త్ర విభాగం, యు అండ్ మీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 'విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై సామాజిక మాధ్యమాల ప్రభవం' అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ రచనలకు రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి రఫియా ఖనం, ఐ.క్యూ. ఏసీ కోఆర్డినేటర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు

మొరాయించిన రైల్వేగేటు


రైల్వేగేటు తెరుచుకోక పట్టాల మధ్యలో వాహనదారులు

బషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్(నవాంద్గీ) రైల్వేగేటు తరుచూ మొరాయిస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఓ గేటు తెరుచుకుని, మరొకటి తెరుచుకోకపోవడంతో వాహనదారులు ముందుకు వెళ్లలేక పట్టాలపై నిలిచిపోవాల్సివచ్చింది. ఈగేటు తరుచూ మొరయిస్తుడటగంతో ఇటు గేట్‌మెన్, అటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గేట్‌మెన్ అక్కడికి చేరుకుని ఆటోమెటిక్‌గా తెరుచుకోని ఆ గేటును మ్యాన్‌పవర్‌తో ఓపెన్ చేయడంతో వాహనాలు ముందుకు కదిలాయి. ఒక్కోసారి ఆ శాఖ మెకానిక్‌లు గేటు వద్దకు చేరుకుని మరమ్మతు చేసే వరకూ గేట్లు పూర్తిగా తెరుచుకోవడంలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'స్టూడెంట్ చాప్టర్' ప్రారంభం


కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. స్టూడెంట్ చాప్టర్ మెంటర్ పల్లవి బద్రీ మాట్లాడుతూ.. ఇంజనీరింగు విద్యార్థులు కళాశాలలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను, సదస్సులతో పాటు స్టూడెంట్ చాప్టర్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయబడుతుందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే వరకు బోధించాలని అధ్యాపకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చీఫ్ జస్టిస్‌పై దాడి వెనుక ఆర్ఎస్ఎస్, బీజేపీల హస్తం'


ఆర్జీకే కాలనీలో ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ఘట్‌కేసర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి వెనుక ఆర్ఎస్ఎస్, బీజేపీల హస్తముందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)మండల కార్యదర్శి అరుణ, సీఐటీయూ నాయకులు సబిత ఆరోపించారు. పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలోని అంబేడ్కర్ చౌరస్తాలో జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అలివేలు, అనసూయ, పార్వతమ్మ, భారతమ్మ, మీనా, ప్రమీల పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌లో చేరలేదు'


మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌తో కాంగ్రెస్ నాయకులు

దోమ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు విస్లావత్ బాల్యానాయక్, సయ్యద్ అంజద్ మూడు రోజుల క్రితం బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారని ప్రకటనలు చేయడం అవాస్తవమని పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎవరూ పార్టీని వీడలేదని, బీఆర్ఎస్ నాయకులు అవాస్తవాలు మాట్లాడటం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, చెవ్వల చెన్న కిష్టయ్య, కుమ్మరి మల్లయ్య, నర్సిములు పాల్గొన్నారు.

కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం



కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఈవో హబీబ్ అహ్మద్

కులకచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నంతో పాటు కూరగాయలు తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని న్యూ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం కూరగాయలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన అన్ని రకాల కూరగాయలను ఎంఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సౌమ్య వెంకట్ రాంరెడ్డి, కరస్పాండెంట్ విజయ్, సుప్రియరెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంబాడీలను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న రాథోడ్ శ్రీనివాస్ నాయక్

కులకచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన మైపతి అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కులకచర్ల పీఎస్‌లో ఎస్సై రమేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ.. భద్రాచలం ఆత్మగౌరవ సభలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ లంబాడీలను కించపరుస్తూ మాట్లాడారని ఆరోపించారు. ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ రాథోడ్, సేనావత్ ప్రకాశ్‌నాయక్, గోపాల్‌నాయక్, పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయమేది?

- రోడ్లపై ఇష్టారాజ్యంగా తోపుడు బండ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- అనువైన స్థలం కేటాయించాలని డిమాండ్

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. జనాభా, వాహనాలు పెరిగినా ఏళ్లుగా తోపుడు బండ్లపై మాత్రం అదేరోడ్డుపై వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య వర్ణనాతీతంగా మారుతోంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో అయితే


వికారాబాద్ పట్టణంలో రోడ్లపై తోపుడు బండ్లు

ఏకంగా వాహనం ముందుకు కదలనంత రద్దీతో ప్రయాణికులు, పట్టణ ప్రజలు సతమతవుతున్నారు. ఈ సమస్య తీరాలంటే తమకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలని పండ్ల వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయమై రాజకీయ నాయకులు హామీలకే పరిమితమవుతున్నారని వాపోతున్నారు.

అధికారుల చర్యలు

నడిరోడ్డులో పండ్లబండ్లు పెడుతుండటంతో మునిసిపల్ అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా శుక్రవారం రోడ్లపై నిలిపిన తోపుడు బండ్లను మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. దీంతో వ్యాపారులు పెద్ద మొత్తంలో మునిసిపల్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో సమాచారం అందుకున్న స్థానిక నేతలు అక్కడకు చేరుకుని అధికారులతో వ్యాపారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే గతంలో పండ్లబండ్లు రోడ్లపైకి రావద్దని గీత గీశామని, అయినప్పటికీ వాటిని దాటి రోడ్లపైకి వస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీంతో ట్రాఫిక్


మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వ్యాపారులు

సమస్యలు ఏర్పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు.

ఒకే చోట విక్రయించాలి

వికారాబాద్‌లో పండ్ల వ్యాపారులు ఒకే చోట విక్రయించాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణానికి దూరంగా కాకుండా ప్రస్తుత బీట్ల మార్కెట్‌లో ఉదయం 11గంటల నుంచి పెట్టుకునే అవకాశం ఉంటుందని, లేదంటే కొత్తగంజ్‌లో షెడ్ల వద్ద ఉన్న స్థలంలో పండ్ల బండ్లు అన్నీ ఒక్క వద్దకు చేరిస్తే కొనుగోలు చేసుకునేందుకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు అనువైన స్థలం కేటాయించి వ్యాపారాలు చేసుకునే విధంగా వీలు కల్పించాలని కోరుతున్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ఫెయిర్


ప్రయోగాలను తిలకిస్తున్న ఎంఈవో జమదగ్ని

కీసర రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగారం జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆవిష్కరించిన పలు ప్రయోగాలను ప్రదర్శించారు. కీసర మండల విద్యాధికారి(ఎంఈవో) జమదగ్ని, నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జెడ్పీహెచ్ఎస్) ప్రధానోపాధ్యాయుడు రాములు విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రయోగాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఆగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు త్రివేణి, అఫ్షన్, ఉపాధ్యాయులు రమ, సత్యశ్రీ, కమల, అర్చన, సాంధ్యారాణి, వందన, రాజ్య లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే బీసీలకు న్యాయం



యాలాల: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, కాంగ్రెస్‌తోనే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని బషీరాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, ఆ పార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు తదితరులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్దిలేదన్నారు.

యాలాల: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కలిసి హైకోర్టులో తమకు అనుకూలమైన వ్యక్తిచే కోర్టులో పిటిషన్ వేయించి స్టే తీసుకువచ్చారని కాంగ్రెస్ యాలాల మండల నాయకులు ఆరోపించారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం యాలాల మండల కాంగ్రెస్ బీసీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షులు శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంఘం ఖుర్దు హన్మంతు, అమృతయ్య, మైపాల్ పాల్గొన్నారు.

పెద్దేముల్: బీసీలకు న్యాయం చేయడమే కాంగ్రెస్‌పార్టీ ధ్యేయమని కాంగ్రెస్‌పార్టీ ఏబ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు అమలుకు హైకోర్టు స్టే విధించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీల నోటి కాడి కూడును లాగేసుకున్నట్లుగా మారిందని అన్నారు. బీసీలు నిరాశకు గురికావద్దని, కాంగ్రెస్ పార్టీ అందరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

7,078 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. నవంబరు నెలాఖరు వరకు సాయంత్రం వేళలో గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. డిసెంబరు నుంచి ఉదయం పాఠశాల ప్రారంభం కావడానికి గంట ముందు, సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత గంట పాటు వేర్వేరు సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగేలా రాష్ట్ర విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. స్లిప్ టెస్టులు నిర్వహించడంతో పాటు విద్యార్థులు ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారనేది గుర్తించి అందుకనుగుణంగా బోధన చేయనున్నారు. పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచి విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు పకడ్బందీగా కొనసాగేలా పర్యవేక్షించాలంటూ డీఈవో రేణుకాదేవి ఇటీవల నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశాల్లో స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షా ఫలితాలతో పాటు ఎఫ్ఎల్ఎన్ అమలుపై ఆమె నియోజకవర్గాల వారీగా హెచ్ఎంలతో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతున్నాయి, సబ్జెక్టు ఉపాధ్యాయులు ఏ విధంగా చెబుతున్నారనేది పర్యవేక్షణ కొరవడింది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల చదువులు, ఉపాధ్యాయుల బోధన తీరుపై పర్యవేక్షణ కొనసాగుతుండగా, కొన్ని పాఠశాలల్లో మాత్రం పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. రోజూ క్రమం తప్పకుండా చదివితే గానీ పట్టు సాధించలేని గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టుల్లో గత ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఈ సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టుసాధించేలా ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విద్యా సంవత్సరంలోనైనా పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంపొందించి మెరుగైన స్థానం పొందే విధంగా జిల్లా విద్యా శాఖ చేస్తున్న ప్రయత్నాలు ఎంత వరకు సఫలీకృతమవుతాయనేది వేచి చూడాల్సిందే.

సబ్ కోర్టు కలేనా?

(ఐదో పేజీ తరువాయి)

సబ్‌కోర్టు ఏర్పాటు అవశ్యం. ఏడాదిలో కేసుల సంఖ్య 500 కంటే ఎక్కువ ఉంటే సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. అయితే తాండూరులో కేసులు తక్కువగా నమోదవుతున్నాయని సబ్‌కోర్టు ఏర్పాటు దరఖాస్తును డిస్మస్ చేశారు. ఇక్కడ సబ్ కోర్టు ఏర్పాటు చేయిస్తామని గతంలో మంత్రిగా మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు న్యాయవాదులకు హామీ ఇచ్చారు. పలుమార్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి దృష్టికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అయితే కోర్టు ఏర్పాటులో ఎలాంటి కదలికా లేదు. గతంలో బార్ అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసిన ప్రముఖ న్యాయవాదులు కూడా సబ్‌కోర్టు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఇటీవల తాండూరుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు సైతం న్యాయవాదులు కోర్టు సబ్‌కోర్టు కోసం వినతిపత్రం ఇచ్చారు.

లేబర్ కోర్టు కూడా అవసరమే...

తాండూరు ప్రాంతంలో ఐదు వరకు సిమెంటు కర్మాగారాలు, నాపరాతి, సుద్ద గనులు, పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో పనిచేసే కార్మికులు 50వేల మంది వరకు ఉంటారు. ఈ ప్రాంతంలో లేబర్ కేసులు కూడా అధికంగానే నమోదువుతున్నాయి. ఈ దృష్ట్యా ఇక్కడ లేబర్ కోర్టు ఏర్పాటు కూడా అవసరం ఉంది. పారిశ్రామికంగా, జనాభా పరంగా అభివృద్ధి చెందిన తాండూరులో అవసరమైన కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమయం వృథా



బషీరాబాద్ మండలం మైల్వార్ నుంచి వికారాబాద్ కోర్టుకు కక్షిదారులు వెళ్లాలంటే రెండు వాహనాలను మార్చాల్సి ఉంటుంది. సమయం వృథాతోపాటు డబ్బు ఖర్చు కూడా ఎక్కువే. తాండూరులో సబ్‌కోర్టు ఏర్పాటైతే కేసులు వెంటవెంటనే పరిష్కారమై న్యాయవాదులకు, కక్షిదారులకు కూడా కలిసొస్తుంది. ఈ విషయమై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలి.

- సుదర్శన్, న్యాయవాది, తాండూరు

కాంగ్రెస్ బీసీలను మోసం చేసింది



మాట్లాడుతున్న గోపాల్

వికారాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో సభపెట్టి అధికారంలోకి వచ్చిన వెంటనే 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టబద్దతతో కూడిన అంశాలన్నీ ఆర్డినెన్స్ పేరుతో ముందుకు వెళ్లారని, క్యాబినెట్ ఆమోదం చేసి గవర్నర్ వద్దకు పంపితే అక్కడ పెండింగ్‌లో ఉందన్నారు. కాంగ్రెస్ మోసంచేసి ఓట్లు దండుకోవాలని మాత్రమే చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కిశోర్, దేవదాసు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: రిజర్వేషన్‌ల పేరుతో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదని మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ అన్నారు. దౌల్తాబాద్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వాయిదా కోసం ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌ల అంశాన్ని వాడుకుందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల పేరుతో నట్టేటా ముంచారన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు శిరీష రమేశ్, కాశప్ప, మల్కరాజు, సంతోష్‌కుమార్, రొయ్యల బాల్‌రాజ్, రమేశ్, బాల్‌రాజ్, గోపాల్, దస్తప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన


ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండస్ వ్యాలీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎన్నికలు, ఓటు హక్కు గురించి అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ పాలమూర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు అనే రెండక్షరాల పదం దేశచరిత్రనే మార్చేస్తుందని విద్యార్థులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశాజ్యోతి ముత్తినేని వీరన్న

మోమిన్‌పేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఆశాజ్యోతి ముత్తినేని వీరన్న అని అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మురహరి అన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్న జన్మదిన సందర్భంగా శుక్రవారం దివ్యాంగుల వేదిక ఆధ్వర్యంలో ఎన్కతలలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతురాజు, బిచ్చయ్య, కోళ్ల రంగారెడ్డి, బోయ వెంకటయ్య, చిన్న జగన్ పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో బహుళ ప్రయోజనాలు


పరిగిలో ఉపాధ్యాయుల శిక్షణలో ఏఎంవో రామ్‌మస్తాన్

పరిగి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బోధనతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏఎంవో రామ్‌మస్తాన్ అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్-1 పాఠశాలలో శుక్రవారం డిజిటల్ లర్నింగ్‌పై ఉపాధ్యాయులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. డిజిటల్ బోధనతో విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుని, వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, రిసోర్స్ పర్సన్‌లు బసప్ప, రాందాస్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని టేకులగడ్డ తండా ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఏఐ ఆధారిత కంప్యూటర్ సామాగ్రిని గురువారం ప్రధానోపాధ్యాయుడు గౌరారం గోపాల్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏఐ ఆధారిత పాఠాల బోధనకు శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులు అభ్యసించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సోమ్లానాయక్, ఐఈఆర్‌పీ వేణుగోపాల్, ఎమ్మార్సీ సిబ్బంది జెమిని బాయి తదితరులు పాల్గొన్నారు.


బొంరాస్‌పేట్: కంప్యూటర్ సామగ్రిని అందుకుంటున్న ఉపాధ్యాయులు

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో తాపీమేస్త్రీ మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ తాపీమేస్త్రీ మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం, ఇటిక్యాల గ్రామానికి చెందిన శివతి కనకయ్య(45) తాపీ మేస్త్రీగా పనిచూసుకుంటూ మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారంలో ఉంటున్నాడు. కనకయ్య శుక్రవారం ఉదయం 9గంటలకు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్, ఆకృతి లేఅవుట్‌లోని తోటి కార్మికులతో కలిసి సత్యనారాయణ వద్ద మేస్త్రీ పనికి వచ్చాడు. తరువాత 11గంటలకు కనకయ్య అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి కార్మికులు 108కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించడంతో అప్పటికే కనకయ్య మృతిచెందినట్లు తెలిపారు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని కొడుకు శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీరంగవరంలో ఉద్రిక్తత!

- ఘర్షణకు దారి తీసిన వాట్సాప్ స్టేటస్
- సకాలంలో స్పందించిన పోలీసులు


గ్రామంలో పోలీసుల బందోబస్తు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గానికి చెందిన యువకుడు తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన ఫొటో రెండు వర్గాల మధ్య వివాదానికి దారితీసింది. గ్రామపెద్దలు, పోలీసులు సకాలంలో స్పందించటంతో వివాదం సర్దుమణిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీరంగవరం గ్రామంలో ఓ యువకుడు తన వాట్సాప్ స్టేటస్‌లో గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవుతో దిగిన ఫొటోను కించపరిచే విధంగా స్టేటస్ పెట్టుకున్నాడు. దీంతో స్టేటస్ చూసిన మరోవర్గానికి చెందిన కొందరు ఈవిషయం పట్ల శుక్రవారం అభ్యంతరం వ్యక్తం చేస్తూ అతడి వద్దకు వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరింది. గ్రామపెద్దలు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఇరువురు వినకపోవటంతో కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి శ్రీరంగవరం గ్రామానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఇతరులను కించపరిచే విధంగా వాట్సాప్‌స్టేటస్ పెట్టుకున్న యువకుడిని మందలించారు. ఇరువర్గాలకు చెందిన పెద్దలు జోక్యం చేసుకుని స్టేటస్ పెట్టుకున్న యువకుడిని మందలించటంతో అతను తన తప్పును ఒప్పుకుంటూ క్షమాపణ చెప్పాడు. దీంతో అభ్యంతరం వ్యక్తం చేసిన వర్గం శాంతించింది. కాగా పోలీసులు ముందు జాగ్రత్తగా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీసీలను మభ్యపెట్టడం సరికాదు


ఎన్నికల అధికారికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరైన నిబంధనలు పాటించకుండా బీసీ సామాజిక వర్గాలను మభ్యపెట్టడం సరైంది కాదని బీజేపీ నాయకులు బాబయ్యనాయుడు, జగదీశ్వర్, బసంత్, దశరత్ తదితరులు అన్నారు. బొంరాస్‌పేట్‌లో శుక్రవారం వారు ఎన్నికల అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ప్రకటించి ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత, నామినేషన్‌లు స్వీకరించేందుకు సిద్ధమయ్యాక అగ్రకులాలను రెచ్చగొట్టి కోర్టు కేసులు వేయించి ఎన్నికలను రద్దు చేయించడం సమంజసం కాదన్నారు. ఇకముందు బీసీల్లో ముస్లింలను, ఎస్సీలలో క్రిస్టియన్‌లను కలపకుండా ఎన్నికలు నిర్వహించాలని, మతపరమైన రిజర్వేషన్‌లకు బీజేపీ వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విలేకరులకు హెల్మెట్లను పంపిణీ చేస్తున్న గురవయ్య

శామిర్‌పేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధలను పాటించాలని జీనమ్ వాలీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గురవయ్య అన్నారు. తూంకుట మున్సిపల్ పరిధి శామీర్‌పేట ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముజీబ్ శుక్రవారం విరాళంగా అందజేసిన హెల్మెట్లను ఆయన విలేకరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గురవయ్య మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ.. అప్రమత్తతోనే పెద్ద ప్రమాదం నుంచి సురక్షితులు కావొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ రాజు, ఎస్సై నవీన్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో గది నిర్మాణం


కాంక్రీట్‌ను అందజేసిన వాసవీ క్రషర్స్ యజమాని

కొడంగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగాయిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా గది నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణానికి అవసరమయ్యే కాంక్రీట్‌ను వాసవి క్రషర్స్ యజమాని కటకం శివకుమార్ గుప్త అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు రిటైర్డ్ టీచర్ హన్మయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సాయిరెడ్డి, మారుతి, శ్రీశైలం, బీరప్ప, రాములు పాల్గొన్నారు.

గౌరారంలో సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన గ్రామస్తులు

దుద్యాల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మడలంలోని గౌరారంలో సీసీ కెమెరాలను అమర్చినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. గౌరారం గ్రామానికి చెందిన పులిందర్‌రెడ్డి రూ.30వేలు ఆర్థిక సాయం అందించడంతో రెండు సీసీకెమెరాలను అమర్చినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీసీ వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు.